www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 23 | నవంబర్ | 2025
పేజీలు : 8

## రామరాజ్యం పేరుతో బిజెపి రాక్షస పాలన





- సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేద్దాం
- చాడ, తక్కెళ్లపల్లి, బాలనర్సింహ, కలివేన, నెల్లికంటి, సాబీర్ పాషా
- భద్రాచలంలో ముగిసిన ప్రచారజాతా

మెయిన్‌లో..

## బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..



**-ప్రజాస్వామ్యపు గొంతు నులిమేస్తున్నారు..**
**-చరిత్రలో నిలిచిపోయేలా శతాబ్ది ఉత్సవ ముగింపు సభ**
**-సిపిఐ జిల్లా స్థాయి సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/ఖమ్మం :** బూటకపు ఎన్‌కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలేనని వీటిపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాంతిచర్చలు జరిపే అవకాశం ఉన్న కేంద్ర ప్రభుత్వం అందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని నిరాయుధులుగా దొరికిన మావోయిస్టులను పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కార్పొరేట్లకు ప్రకృతి సంపదను కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే మావోయిస్టు పార్టీ నిర్మూలన శపథం చేశారని ఆయన తెలిపారు. రాజ్యం పరిధిలో విచారణ జరిపే హక్కు ఉన్న జరపడం లేదని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టులు ప్రజల కోసం పని చేస్తున్నారని ఈ దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించాలంటే మావోయిస్టులు ఏ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారో ఆ సమస్యలను పరిష్కరించాలి తప్ప మావోయిస్టు పార్టీ నాయకులను కాల్చి చంపడం కాదని ఆయన తెలిపారు. దండకారుణ్యంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఉన్న ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ యథాశక్తి ప్రయత్నిస్తుందని

మిగతా 2లో..

## గేమ్ చేంజర్‌గా యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం



**-33/11 కెవి సబ్‌స్టేషన్, రోడ్డు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన**
**-నా రాజకీయ జీవితానికి పునాది వైరా**
**-ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/వైరా:** అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులాలను నిర్మిస్తున్నారని రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇందన శాఖా మంత్రి, మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, టిజి ఎన్పిడిసిఎల్ ఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి వైరాలో సుమారు 20 ఎకరాల స్థలంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణ పనులకు, వైరా నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రూ.18.46 కోట్లతో చేపట్టిన ఏడు 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు రూ.58.50కోట్లతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత వైరాకు వచ్చిన మల్లు భట్టివిక్రమార్కకు కాంగ్రేస్ శ్రేణులు కాంగ్రేస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఘనస్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

మిగతా 2లో..

## గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి



**-పుట్టింటి సారె మాదిరి చీరల పంపిణీ**
**- బిటి రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ప్రజారోగ్యం బాగుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రహదారుల నిర్మాణంతోనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. శనివారం మండల పరిధిలోని శివాయిగూడెం గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. శివాయిగూడెం నుంచి మంచుకొండ వరకు రూ. 3.70 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తరుపున పుట్టింటి సారె మాదిరి ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామం బాగుంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు.రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. పామాయిల్ సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. పామాయిల్ సాగు వల్ల

మిగతా 2లో..

## పేద ప్రజల గుండెచప్పుడు సిపిఐ





**-భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు**
**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పేద ప్రజల గుండె చప్పుడు సిపిఐ అని, భారత గడ్డపై సిపిఐ 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న చరిత్ర ఒక సిపిఐ పార్టీకే సాధ్యమైన విషయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే సాబీర్ పాషాలు అన్నారు. భారత కమ్యూనిస్టు శతజయంతి ఉత్సవాలలో భాగంగా నవంబర్ 15 నుండి 25 వరకు తలపెట్టిన ప్రచారంలో భాగంగా శనివారం బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర్‌కు చేరుకున్న బస్సు ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మోరంపల్లి బంజర్‌లో పార్టీ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బస్సు ప్రచార జాతతో పాటు నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీగా సారపాక సెంటర్‌కు చేరుకున్నారు. సారపాక సెంటర్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముివ్వ వెంకటేశ్వరరావు అధ్యక్షతన బస్సు ప్రచార జాతలో భాగంగా సభ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే సాబీర్ పాషాలు మాట్లాడుతూ భారత దేశ ప్రజలకు స్వతంత్రం కోసం అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వెట్టి చాకిరి విముక్తి కోసం బానిసత్వం నుండి భూస్వాములు రజాకర్ల నుండి ప్రజలను విముక్తి కల్పించి, పేద ప్రజలకు లక్షలాది ఎకరాల భూములను పంచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని నిరంతరం ప్రజా పోరాటాల్లో నిమగ్నమైన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రచార జాతర నిర్వహించడం

మిగతా 2లో..

# బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన తెలిపారు. మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి అదే సందర్భంలో సంపన్నులకు ఈ దేశాన్ని తాకట్టుపెడుతుందన్నారు. కేవలం మతం పేరుతో ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్న ఎన్డిఏ ప్రభుత్వం మరో పక్క ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రజలను సమీకరించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దేశం మోడీ పాలనలో తిరోగమనం వైపు పయనిస్తుందన్నారు.



**చరిత్రలో నిలిచిపోయేలా సభ...**

చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు తెలిపారు. డిసెంబర్ 26 నాటికి భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావించి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 40 దేశాల నుంచి ప్రతినిధులు సౌహార్థ సందేశాలు ఇచ్చేందుకు వస్తున్నారన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను సామ్రాజ్యవాద, భూస్వామ్య పెత్తందారి వర్గాలపై పోరాటం, సాధించిన హక్కులు, విజయాలను నేటి తరానికి తెలియజేప్పేందుకే రాష్ట్ర వ్యాప్తంగా జాతాలను నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభల ఉద్యమ సందేశాన్ని ఇంటింటికి అందజేయడం జరుగుతుందన్నారు. ఖమ్మంలో జరిగే ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిని సమీకరించనున్నామని ఆయన తెలిపారు. చారిత్రిక సభ తర్వాత కమ్యూనిస్టు పార్టీ పురోగమనం తథ్యమని కూనంనేని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గేమ్ చేంజర్‌గా యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)




వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.400కోట్లకు పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ గేమ్ చేంజర్‌గా యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం నిలుస్తుందని అన్నారు. ప్రపంచ స్థాయి పోటీని ధీటుగా ఎదుర్కొనేలా మన విద్యార్థులను తయారు చేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులాలు నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి యంగ్ ఇండియా స్కూల్‌కు 20 ఎకరాల ప్రాంగణంలో రూ.200కోట్లు ఖర్చు చేసి సకల సదుపాయాలతో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉండేలా, విద్యాబోధన చేసే స్టాఫ్, ఇతర సిబ్బంది క్వార్టర్స్ సైతం అక్కడే నిర్మిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో ప్రోత్సాహం అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణానికి సంబంధించి రూ.30కోట్ల నిధులను కలెక్టర్ ఖాతాకు ఇప్పటికే విడుదల చేశామని, పనుల వేగం ఆధారంగా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించుకొని బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో అనేక ధరలు పెరిగిన డైట్ చార్జీలు, కాస్మొటిక్స్ చార్జీలను పెంచలేదని, పిల్లలు పోషకాహార లోపంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దీనిని గమనించిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40% డైట్ చార్జీలు, 200% కాస్మొటిక్స్ చార్జీలను పెంచడం జరిగిందని అన్నారు. గురుకులాల్లో పిల్లలకు మంచి ఆహారం పెట్టాలని లక్ష్యంతో నిష్ణాతులైన వైద్యులచే కామన్ డైట్ మెనూ తయారు చేసి పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. వైరా నియోజకవర్గ పరిధిలో 52019 కుటుంబాలు ఉచిత విద్యుత్ లబ్ధి పొందాయని, ప్రజల తరపున రూ.35కోట్లు ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేసేలా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. వైరాలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. వైరా రిజర్వాయర్ కాల్వల లైనింగ్ పనులు జరుగుతున్నాయని, ఏటిసిను సైతం మంజూరు చేస్తామని త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ... వైరా అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం గడిచిన రెండ సంవత్సరాల కాలంలో రూ.500కోట్లు మంజూరు చేసిందని అన్నారు. సీతారామ కాల్వల నుంచి వైరా ప్రాజెక్టుకు నీరు తరలించేందుకు రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించామని, వైరా ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల మరమ్మత్తు కోసం నిధులు మంజూరు చేశారని, రూ.200కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం నిర్మిస్తున్నామని అన్నారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సిఎం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి 1456 స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.153.60కోట్ల బ్యాంకు లింకేజి రుణాలు చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, డిసిసి డైరెక్టర్ బొర్రా రాజశేఖర్, డిఆర్‌డివో సన్యాసయ్య, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ యాకోబ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, డిఈవో చైతన్యజైని, డిఐఈవో రవిబాబు, మాజీ శాసనసభ్యులు కొండపల్లి కోటేశ్వరరాము, మాజీ ఎమ్మెల్సీ కోట్ల నాగేశ్వరరావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మహిళా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఫణితి సైదులు, ఆర్యవైశ్య జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, ఫణితి శ్రీనివాసరావు, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, పొదిలి హరినాధ్, మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ వేల్పుల మురళి, వీరంశెట్టి సీతారాములు, జవ్వాజి నాగరాజు, మిట్టపల్లి నాగి, ఆత్మ కమిటీ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏచర్ల సత్యం, టిలికం అడ్వైజరీ మెంబర్ మచ్చా రామారావు, ఎన్‌ఎస్‌విఐ వైరా నియోజకవర్గ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, నిప్పు, ఫణితి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, ఏపిఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద ప్రజల గుండెచప్పుడు సిపిఐ

(మొదటిపేజీ తరువాయి)



జరుగుతుందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న 5లక్షల మందితో ముగింపు ఉత్సవాలలో పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు అభిమానులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయపద్రం చేయాలని కోరారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా) మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మారుతున్న రాజకీయాల నేపథ్యంలో ఐదేళ్లు అధికారంలో లేకుంటే కానరకుండాపోయే పార్టీలు ప్రజల అధికారంలో ఉన్నప్పుడు కనీసం ప్రజలు అవసరాలను కూడా తీర్చలేని పార్టీల కన్నా ఈ రోజు వంట గ్యాస్ ధర పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిన నిత్యవసరల ధరలు పెరిగిన ఎల్లప్పుడు కార్మిక వర్గానికి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. మనకు అధికారం ఉన్న లేకున్నా ఈ దేశంలో ప్రజా సమస్యలపై కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో ఈ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని అన్నారు. అనంతరం బైక్ ర్యాలీగా భద్రాచలం చేరుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, మహబూబాబాద్ పార్టీ జిల్లా కార్యదర్శి బి విజయసామిరెడ్డి, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాశిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మి నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యా విశ్వనాథం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరాల శ్రీనివాసరావు, కమటం వెంకటేశ్వరరావు, వి మల్లికార్జున్, సిపిఐ మండల కార్యదర్శి సప్పం నాగేశ్వరరావు, అశ్వాపురం సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు అలవాల సీతారామిరెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, సిద్ధారపు సుబ్బారెడ్డి, ఎండి సాజిద్, పాండవుల బిక్షం, తోకల శ్రీను, మల్సూర్, సారెడ్డి గోవింద్, రాంబాబు, పేరం వెంకటేశ్వరరెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, సోడే చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు కోతుల బెడద, చీడపీడల బెడద కూడా ఉందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందని తెలిపారు. పామాయిల్ సాగులో అంతర పంటలను కూడా సాగు చేయవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పండుగలా గ్రామాల్లో చీరల పంపిణీ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి. నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, భూక్యా బాలాజీ నాయక్, బండి వెంకన్న, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

**-టియుడబ్ల్యూజె (ఐజెయు) సమావేశంలో కె. రాంనారాయణ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా త్వరలో ఆందోళన, కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కమిటీ సమావేశం స్థానిక డిపిఆర్‌సిలో జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించి అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదని జర్నలిస్టు సమాజం పోరు మార్గంలో పయనిస్తేనే ప్రభుత్వంలో కదలిక వస్తుందన్నారు. బాధ్యతాయుతమైన యూనియన్‌గా టియుడబ్ల్యూజె (ఐజెయు) జర్నలిస్టుల ఆందోళనకు ముందు వరుసలో నిలవాలన్నారు. సంక్షేమానికి, హక్కుల సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మైసా పాపారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. త్వరలో సెమినార్ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. సమావేశంలో తాళ్లూరి మురళికృష్ణ, పి. నాగేశ్వరరావు, యోగి, శ్రీనివాస్, సురేష్, బాలరాజు, పప్పుల శ్రీనివాస్, శీలం శ్రీను సభ్యులుగా దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయగా దానికి కన్వీనర్‌గా తాళ్లూరి మురళీకృష్ణను సమావేశం ఎన్నుకుంది. హెల్త్ కమిటీ కన్వీనర్‌గా వై. మాధవరావు, సభ్యులుగా కనకం సైదులు, సిహెచ్ శ్రీనివాస్, ఎన్. ఉపేందర్, గోపాల్, బాబురావు, అరుణ్, నాగరాజు లు సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్‌గా మాటేటి వేణుగోపాల్, సభ్యులుగా ఎం. భూపాలరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, మహేందర్, ఎస్‌కె మోహినుద్దీన్, ఏలూరి వేణుగోపాల్, సత్యనారాయణ సభ్యులుగా ఉన్నారు. వెల్ఫేర్ కమిటీకి కన్వీనర్‌గా సామినేని మురారి ఎన్నిక కాగా సభ్యులుగా నలజాల వెంకట్రావు, నర్వనేని వెంకట్రావు, పురుషోత్తం, ఎన్. జనార్ధనాచారి, మైసా పాపారావు లు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సభలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు తదితరులు ప్రసంగించగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురా రి, మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు భూ పాల్, మహేందర్, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జనార్ధనాచారి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నామ పురుషోత్తం, శీలం శ్రీనివాస్, సంఘం బాధ్యులు తాళ్లూరి మురళీకృష్ణ, మోహీనుద్దీన్, మాధవరావు, సత్యనారాయణ, కళ్యాణ్, యోగి, పోలంపల్లి నాగేశ్వరరావు, బహదూర్, శ్రీనివాస్, అరుణ్, పప్పుల శ్రీనివాస్, నాగరాజు, లక్ష్మి నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

# ఐజెయు ఆధ్వర్యంలో అన్నం శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం :** వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న అన్నం శ్రీనివాసరావును టియుడబ్ల్యూజె (ఐజెయు) శనివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అన్నం సేవల ద్వారా వేల కుటుంబాలు ఓదార్పు పొందాయన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో అన్నం అందించిన సేవలు సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయన్నారు. ఇప్పటికీ అనాథలకు బంధువుగా, ఆప్తులుగా నిలుస్తున్నారని రాంనారాయణ తెలిపారు. 30వేలకు పైగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ముఖ్యంగా టియుడబ్ల్యూజె (ఐజెయు) సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. తుదిశ్వాస వరకు సేవా రంగంలోనే ఉంటానని అన్ని ప్రశంసల కంటే ఐజెయు సన్మానం తనకు చాలా గొప్పదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యులు, నగర కమిటీ బాధ్యులు, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

# సిపిఐలో చేరిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్



## -పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మం:** దుర్గ విరించి హాస్పటల్ అధినేత, ప్రముఖ గుండె, షుగర్ వైద్యనిపుణులు కిరణ్‌కుమార్ గుదిగొండ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలోకి చేరారు. జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహామ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డిలు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన గుదిగొండ రామలింగం ద్వితీయ కుమారుడు వైద్యులు కిరణ్‌కుమార్. రామలింగం సిపిఐ నాయకునిగా పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారు. తన ఇద్దరు కుమారులను ఎంతో కష్టపడి ఒకరిని వైద్యునిగా, మరోకరిని సమాచార శాఖలో ఉన్నతాధికారిగా తీర్చిదిద్దాడు. వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీలో తన తండ్రి ఆశయాలను అనుగుణంగా సభ్యుడుగా చేరడం ఆనందంగా ఉందని కిరణ్‌కుమార్ తెలిపారు. కిరణ్‌కుమార్‌తో పాటు సిపిఐలోకి చేరిన వారిలో బెతంపూడి ఉపేందర్, ఆదెర్ల ప్రవీణ్, గుదిగొండ లోకేష్, యలగాడి వరలక్ష్మి, తుమ్మల రఘు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు ఎండీ సలాం, బిజి క్లైమెంట్, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, నాయకులు షేక్ సైదా, ఆకెన పవన్ తదతరులున్నారు.

# సీతారత్నం ట్రస్టు చేయూత అభినందనీయం



## -విద్యార్థులకు చెక్కులు అందించిన కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యారంగ పురోభివృద్ధికి ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయం, అనుసరణీయమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం ఖమ్మంలో కొణిజర్ల గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని పి. ఉషారాణికి రూ. 20వేల చెక్కును చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బిఫార్మసీ విద్యార్థిని శ్రీరాం మానసకు రూ. 20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్బంగా కూనంనేని మాట్లాడుతూ విద్య మనిషిని ఉన్నత స్థాయికి చేరుస్తుందని అన్ని సంపదల్లో కెల్లా విద్యే గొప్ప సంపద అని ఆయన తెలిపారు. ఆర్థికంగా వెనకబడి ఉన్నత చదువులు చదివేందుకు ఇబ్బందులు పడుతున్న వారికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అనేక ఏళ్లుగా ఆర్థిక చేయూతనిస్తూ ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు తోడుగా నిలుస్తుందన్నారు. విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన, ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ఆర్థికంగా వెనకబడిన వారికి దన్నుగా నిలిచేందుకు నగదు ప్రోత్సాహకం అందించడం సామాన్య విషయం కాదని ట్రస్టు బాధ్యులు విశ్రాంత ఉపాధ్యాయుడు పరిశ పుల్లయ్య అభివృద్ధి కాముకుడే కాకుండా గొప్ప మానవతావాది అని కూనంనేని తెలిపారు. పుల్లయ్యను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య, మానస తల్లి విజయ, ప్రభుత్వ ఉపాధ్యాయులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** రైతులు, కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు కార్మిక చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మధిర స్థానిక వ్యవసాయ మార్కెట్ ఎదుట కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు కార్మిక వ్యతిరేక చట్టాల అమలును వ్యతిరేకిస్తూ తెలంగాణ రైతుసంఘం సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రైతుల కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ సాధారణ ప్రజల ఆర్థిక పరిస్థితులను రోజురోజుకు దిగజారుస్తూ కార్మిక వర్గాన్ని అండగా ఉండే కార్మికచట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులను యజమానులు దగ్గర హక్కల కోసం బిక్షం ఎత్తుకునేలా కుట్ర జరుగుతోందని అన్నారు. కార్మిక వర్గం రైతాంగ వ్యవసాయ కూలీలు సంఘటితంగా పోరాడి తమ హక్కులు పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రైతులు తీసుకువచ్చిన వరిధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శీలం నర్సింహారావు, వ్య.కా.సం మధిర డివిజన్ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తేలపోలు రాధాకృష్ణ, సంఘ నాయకులు సైదులు, రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్ర, సిఐటియు నాయకులు పడికంటి మురరళీ, కన్వీనరర్ అన్నం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎల్ మాక్ టెస్ట్‌ను నిర్వహించడం అభినందనీయం

**- సీనియర్ న్యాయవాది సోమశేఖర శర్మ**






**ప్రజాపక్షం/ఖమ్మం :** నూతన న్యాయవాదులకు ఉపయోగపడేలా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) మాక్ టెస్ట్‌లను నిర్వహించడం శుభ పరిణామమని సీనియర్ న్యాయవాది సోమశేఖర శర్మ తెలిపారు. శనివారం మానేరు లా కళాశాలలో ఐఏఎల్ ఖమ్మం జిల్లా, నగర సమితి ఆధ్వర్యంలో మాక్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్బంగా ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు లతీఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సోమశేఖర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేనివిధంగా ఖమ్మంలో మాక్ టెస్ట్‌ను నిర్వహించడం ద్వారా అనేక మందికి ఉపయోగం జరుగుతుందన్నారు. మూడు నెలలకు ఒకసారి ఐఏఎల్ న్యాయవాదులకు శిక్షణా తరగతులను నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఖమ్మం అంటేనే సామాజిక స్పృహ కలిగిన ప్రాంతమని ఈ ప్రాం తంలో ప్రారంభమైన ప్రతి కార్యక్రమం రాష్ట్ర వ్యా ప్తమవుతుందని మాక్ టెస్ట్ కూడా అన్ని జిల్లాల్లో జరిగేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. పరీక్షల్లో పుస్తకాలను చూసి రాయాల్సి ఉంటుందని దీనిని పరీక్ష రాసే వారు గమనించాలన్నారు. నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చేవారు సామాజిక అంశాలపై, రుగ్మతలపై, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ టెస్ట్‌కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది అభ్యర్థులు హాజరై పరీక్షలు వ్రాశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా గౌరవాధ్యక్షులు పారుపల్లి అమర్‌చంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, మానేరు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ, న్యాయవాదులు మామిడి హన్మంతరావు, ఐలు నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్‌వి రమణ, షేక్ నస్రీన్, కొల్లికొండ శరత్‌బాబు, రాకేష్, ఫర్వేజ్, మధు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లలను విడుదల చేసిన డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/ మధిర :** నిర్దేశిత లక్ష్యం ప్రకారం నీటి వనరులలో చేప పిల్లలను విడుదల చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మధిర పెద్ద చెరువులో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధిర నియోజకవర్గ పరిధిలో ఉన్న నీటి వనరులలో 77లక్షల చేప పిల్లలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేప పిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. చేప పిల్లల కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసి మత్స్య కారులకు లబ్ధి చేకూర్చాలని అన్నారు. మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధాకారులతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయాధికారులు, ఎంపిడిఓ, జిల్లా వ్యవసాయ విస్తరణాధికారులు పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

## - డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ బోనకల్ :** మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బోనకల్‌లో రూ.1.75కోట్లతో నిర్మించనున్న ఇందిరా మహిళా డెయిరీ ప్రహరీ గోడ, గ్రౌండ్ లెవెలింగ్ పనులకు జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు బాగుపడతాయని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రత్యేకంగా ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ప్రతిఒక్కరికి చీర తప్పకుండా ఇంటికి అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిఆర్‌డిఓ సన్యాసయ్య, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం ఖమ్మంపాడు పిఎసిఎస్ పరిధిలోని ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం మధిర మండల ఎఓ కనకం సాయిదీక్షిత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ధాన్యం దిగుబడి ఎలా ఉంది అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆహర్నిశలు కష్టపడి పండించిన ప్రతి గింజను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ దొండపాటి సత్యనారాయణ, వడిత్యలాల్, పత్తేపురపు సంగయ్య, ఖమ్మంపాడు ఎఇఓ సుష్మ, సొసైటీ సిఇఓ యర్రం శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది ఆదిలక్ష్మి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహం

## ఆచూకీ తెలిస్తే తెలపండి : ఎస్ఐ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఈనెల 18న పల్లిపాడు వైరా మధ్యలో గల ఉప్పడుమిల్లు వద్ద రోడ్డు దాటుతుండగా రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదు. ఈఫోటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిస్తే కొణిజర్ల పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712527332 కు తెలియజేయాలని కొణిజర్ల ఎస్సై జి సూరజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## వెంకటేశ్వర్లు మృతి బాధాకరం : కూనంనేని



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ నివాసి సీనియర్ సిపిఐ నాయకులు సొబ్బని సూర్యం కుమారుడు సొబ్బని వెంకటేశ్వర్లు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి బారిన పడి అకాల మరణం చెందారు. వారి మృతదేహానికి శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబ శివరావు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు తండ్రి సొబ్బని సూర్యం సిపిఐ పార్టీ లో చాలా కాలం నుండి పనిచేస్తున్నారని ఇలాంటి నిబద్ధతగల నాయకుడి కుమారుడి మరణం చాలా బాధాకరమని ఆయన అన్నారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వెంకటేశ్వర్లు భార్య, పిల్లలను, తల్లి దండ్రులను ధైర్యంగా ఉండాలని, అధైర్య పడద్దని కూనంనేని ధైర్యాన్ని ఇచ్చారు. వారి వెంట సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, ఎల్లంకి మధు, సిరిపురం వెంకటేశ్వర్లు, గుడిమెట్ల సీతయ్య, చిమట ముత్తయ్య, బెజవాడ సీతయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

## తూనికలు, కొలతల అధికారుల తనిఖీ



ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల కేంద్రంలోని మార్కెట్ యాడ్ సమీపంలోని వేబ్రిడ్జ్ లను తూనికల కొలతల శాఖ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. తూనికల కొలతల శాఖ జిల్లా అధికారి మనోహర్ వేబ్రిడ్జ్ లోని డిజిటల్ తూకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జూలూరుపాడు వేబ్రిడ్జ్ లనందు తూకంలో తేడాలోచ్చాయని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టామని. ఎలాంటి తేడాలు లేవని తెలిపారు. ఇకపై తనిఖీలు నిత్యం కొనసాగుతాయని తెలిపారు. తూకాల్లో తేడాలకు పాల్పడితే కటిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని ప్రతివ్యాపారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్ణీత కాలపరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతి తీసుకోవటం, తూకం రాళ్లకు ముద్రలు వేయించుకోవటం చేయాలన్నారు. నిర్ణీత గరిష్ఠ ధరలు (ఎంఆర్పీ) కంటే ఎక్కువ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ముందు ముందు తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## మా వీధిలో బ్రాందీ షాపు పెట్టొద్దని ఎక్సైజ్ సిఐకి వినతి



ప్రజాపక్షం/చండ్రుగొండ: మా వీధిలో బ్రాందీ షాప్ పెట్టొద్దని శనివారం కొత్తగూడెం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ జయశ్రీకి స్థానిక ఉత్తరంటూ వీధి వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి వెళ్లేందుకు ఒకటే రహదారి ఉన్నదని దీనివల్ల సమస్యలు వస్తాయని అన్నారు. బస్టాండ్ నుండి దగ్గరలోనే వైన్ షాప్ పెడితే ఎలా అని అన్నారు. కాలనీకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కూలీలు అధికంగా మా కాలనీలో ఉన్నారని, అనునిత్యం ఈ రోడ్డు వెంటనే మహిళలు వృద్ధులు వెళుతూ ఉంటారని అన్నారు. దీని దృష్టిలో పెట్టుకొని ఎక్సైజ్ శాఖ పర్యవేక్షించి బ్రాందీ షాపును నిలుపుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాలనీకి చెందిన యువత, తదితరులు పాల్గొన్నారు.

## రేంజర్ శ్రీనివాసరావు ఆశయాలను కొనసాగిద్దాం



ప్రజాపక్షం/చండ్రుగొండ: గత మూడు సంవత్సరాల క్రితం గుత్తికోయల చేతుల్లో అమానుషంగా హత్యకు గురైన రేంజర్ శ్రీనివాసరావు ఆసియాలను కొనసాగిద్దామని ఎఫ్‌డివో కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని బెండలపాడు గ్రామ శివారులో కీర్తిశేషులు రేంజర్ శ్రీనివాసరావు పేరు మీద ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. శనివారం ఆ ప్లాంటేషన్‌ను సందర్శించి శ్రీనివాసరావు స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడితే పర్యావరణానికి ఎటువంటి ముప్పు ఉండదన్నారు. పోడు నరకవద్దని గుత్తికోయలకు అవగాహన కల్పించామన్నారు. పోడు నరికితే సహించేది లేదన్నారు. అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల ఫారెస్ట్ రేంజర్ అధికారి ఎల్లయ్య, శ్రీనివాసరావు, మండలాల రేంజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక సంగ్రామం..!

## వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు

-పంచాయతీ తరువాతనే ప్రాదేశిక ఎన్నికలు

-నిర్వహణకు సిద్ధమైన యంత్రాంగం






ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక సంస్థ ఎన్నికలకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో గ్రామాలలో రాజకీయ సందడి నెలకొంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు జోష్ తో స్థానిక ఎన్నికలలోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని భావిస్తోంది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లి, తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిచింది. స్థానిక ఎన్నికల నిర్వహణ పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జనవరి మొదటి వారంలో గా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలని యోచిస్తుంది.

### యంత్రాంగం సన్నద్ధం...

స్థానిక ఎన్నికల నిర్వహణ కు యంత్రాంగం సిద్ధంగా ఉండటంతో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ లో భాగంగా ఇప్పటికే వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా ,ఓటర్ల జాబితా పై అభ్యంతరాల స్వీకరణ పూర్తైయ్యాయి. బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది నోడల్ అధికారులు కేటాయింపు, రిజర్వేషన్ల ఖరారు అయ్యాయి. రెండు విడతలు గా ఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్‌లకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ల ను ముద్రించేందుకు సిద్ధంగా ఉంచారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల స్టే ఇవ్వటంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.

### మొదట పంచాయతీ....తరువాతే పరిషత్...

ఇటీవల విడుదలైన ఎన్నికల నోటిఫికేషన్ లో మొదట పరిషత్ తరువాతే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా నిర్ణయించారు. మారిన పరిస్థితులలో తోలుత పంచాయతీ, తదుపరి పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైకోర్టు లో సైతం పంచాయతీ ఎన్నికల పైనే కేసులు ఉండటంతో రిజర్వేషన్ల పీటముడి విప్పి ఎన్నికలకు పోనుంది.

### కుంటుపడిన పాలన....

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవటంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో పల్లెలో పాలన అస్థవ్యస్తంగా మారింది. 2024 ఫిబ్రవరి తో పదవీ కాలం ముగిసింది. దీంతో ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ వారికి నిధులు ఇవ్వకపోవటంతో స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల వైపు కన్నెత్తి చూడలేదు. కేంద్రం నిధులు వస్తేనే గ్రామాల అభివృద్ధి కావటంతో తప్పని పరిస్తితిగా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో విజయం, స్థానిక ఎన్నికల నిర్వహించేంది ఎప్పుడో ఈ నెల 24 న హైకోర్టుకు ప్రభుత్వం తెలియజేయాల్సి ఉంది. దీంతోరాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమైంది.

### జిల్లాలో ప్రస్తుతం....

ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 571 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 8,02,691 ఓట్లు ఉన్నాయి. వీరికి 5,214 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందు కోసం 8,211 మంది సిబ్బందిని కూడ నియమించారు. 6,257 బ్యాలెట్ బాక్స్‌లు అవసరం కాగా ఇప్పటికే 3,146 సిద్ధం చేసి ఉంచారు. మిగిలిన వాటిని రప్పించే ప్రయత్నాలు చేపట్టారు. ఇది ఇలా ఉండగా రిజర్వేషన్‌ల పై చర్చ జోరుగా సాగుతుంది. గతంలో ఉన్న రిజర్వేషన్ లు ఉంటాయా లేక మారుతాయా అనే దానిపై గ్రామాలలో జోరుగా చర్చ సాగుతుంది. అయినప్పటికీ గ్రామాలలో స్థానిక ఎన్నికల సందడి సాగుతుంది. రహస్య సమావేశాలు...అనుచరులతో మందు పార్టీలతో సందడి గా మారింది. మొత్తం మీద ఖమ్మం జిల్లాలో స్థానిక సంగ్రామం తో సందడి గా మారింది.

## ఆరోపణలు ఉన్నా.. అధికారుల పర్యవేక్షణ శూన్యం..!

-కదలని అధికార యంత్రాంగం

-బట్టీల వైపు కన్నెత్తి చూడని పలు శాఖలు





ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం మండలంలో బట్టీలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. బట్టీలలో ఇటుకలను రూ 8 నుండి రూ 16 రూపాయల వరకు అమ్మడంతో పేదవాడికి ఇల్లు కట్టుకునే కనీస అవసరమైన ఇటుకను అధిక ధరకు అమ్మడం బట్టి యజమాన్యాలకు అణువుగా మారింది. ప్రభుత్వ నిబంధనలు పాటించని బట్టీల యజమాన్యాలపై ఆయాపరమైన శాఖలు అనగా పర్యావరణ, కాలుష్య, రెవెన్యూ శాఖలు షోకాజ్ నోటీసులు ఇచ్చి నిర్ణీత సమయానికి వారి దగ్గర సమాచారం తీసుకోవాలి. పర్యావరణ అనుమతి, వ్యాపార లైసెన్స్, భవన, భూమి అనుమతి లాంటి లైసెన్సులు రద్దు చేయడం, అనుమతి లేని యంత్రాలు లేదా ప్రమాదకర పద్ధతులు ఉపయోగిస్తే అధికారులు వాటిని సీజ్ చేయడం, పర్యావరణానికి నష్టాన్ని కలగజేయడం, మానవ మనుగడ కూడా కోల్పోయే విధంగా చేస్తున్న బట్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కనీస వేతనాలు ఇవ్వకపోవడం భద్రతా పరికరాలు ఇవ్వకపోవడం, బాల కార్మికులను ఉపయోగించడం లాంటివి ఉన్నాయి. కాబట్టి కార్మిక శాఖ కేసులు నమోదు చేయాలి. పర్యావరణ కా లుష్యం లైసెన్స్ లేకుండా పని చేయడం నిబంధన పాటించకపోవడం కార్మిక చట్టాలను ఉల్లంఘించిన రీత్యా వారిపై శాఖలు భారీ జరిమాన విధించాలి.

### మామూళ్ల మత్తులో...పర్యవేక్షణ లోపమా..

నిబంధనలను అతిక్రమించి నడుస్తున్న బట్టీల యాజమాన్యాలపై ఇంత వరకు ఎటువంటి నోటీసులు జారీ చేయకపోవడం కానీ పర్యవేక్షించడం కానీ చేయకపోవడం వల్ల ఇష్టరీత్యాగా బట్టీలు నడుపుతూ వారి వ్యాపార సముదాయాన్ని పెంచుకుంటూ పోతున్నారు. దీనికి ఉదహరణ గత వారం రోజుల క్రితం జరిగిన ట్రాక్టర్ డ్రైవింగ్ ప్రమాద ఘటన వలన ఆదివాసి మృతి చెందిన సంఘటనే కారణమని చెప్పవచ్చు. చనిపోయిన వలన కూలీకి న్యాయం జరిగిందా అనే పర్యవేక్షణ కూడా అధికారులదే కానీ, కనీసం కన్నెత్తి యజమాన్యాల వైపు చూడలేని పరిస్థితి. కేవలం అధికారులు మామూళ్లమత్తులో యజమాన్యాల వారి దగ్గర తీసుకోవడం వల్లనే బట్టీలపై పర్యవేక్షణ లోపం అని కనీసం జిల్లా కలెక్టర్ అయిన దీనిపై తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, బట్టీల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, కూలీలు, మండల ప్రజలు తదితరులు కోరుకుంటున్నారు.

### నిర్లక్ష్య ధోరణిలో బట్టీల యాజమాన్యాలు...

బట్టీల యాజమాన్యం నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసుకుంటున్నారు. శ్రామికుల శ్రమను దోచుకుంటూ కోట్లు గడిస్తున్నారు. అన్ని శాఖలకు మామూలు ఇస్తాన్నాం కదా మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరని నిర్లక్ష్యం ధోరణి ఉన్నారని పలువురు పేర్కొంటున్నారు.

## పత్తి ముంచిందని మొక్కజొన్న వైపు రైతుల చూపు..!

-దిగుబడి లేక పత్తి పంటను పీకేస్తున్న రైతులు

-మొక్కజొన్నతో ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందన్న ఆశ

-జూలూరుపాడు మండలంలో భారీగా పెరిగిన మొక్కజొన్న సాగు





ప్రజాపక్షం/జూలూరుపాడు: పత్తి రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి అష్టకష్టాలు పడిన రైతన్నలు. మరిన్ని నష్టాలను భరించలేమన్న విషయాన్ని గ్రహించారు. పత్తితో లాభం లేదనుకొని. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు దృష్టి పెట్టారు. పంటకాలం పూర్తికాకముందే పత్తి చేనును పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ వానాకాలంలో భారీ వర్షాలతో పత్తి పంట దెబ్బతినడం, భవిష్యత్తులో కోలుకొని దిగుబడి వస్తుందనే భరోసా లేకపోవడంతో రైతులు పత్తి మొక్కలు పీకేస్తున్నారు. కొందరు రెండోసారి పత్తి తీశాక మొక్కలను పీకేస్తుండగా, మరికొందరు ఒక్కసారి పత్తి తీసిన వెంటనే ప్రత్యామ్నాయ పంటను ఎంచుకుంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 1012 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జూన్, జూలైల్లో కాస్త తక్కువ వర్షాలు పడినా, ఆగస్టు నుంచి కుండపోత వర్షాలు కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో పడే వర్షాలతోపాటు అకాల వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో పత్తి పంట కోలుకోలేని విధంగా తయారైంది. దిగుబడి పూర్తిగా పడిపోయింది. పత్తి సాగుకు కేంద్రబిందువైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులకు ఎకరాకు 6నుంచి 7 క్వింటాళ్లకు మించి దిగుబడి రాక రైతులు పత్తి పంటను పీకేస్తున్నారు.

### ఒకటి, రెండు సార్లు పత్తి తీయగానే..

సాధారణంగా పత్తి పంట ఏడాది పాటు సాగులో ఉంటుంది. జూన్‌లో మొదలైతే మార్చి నెలాఖరు వరకు ఉంచినా పత్తి దిగుబడి వస్తుంది. అయితే, రైతులు జూన్ నుంచి డిసెంబరు వరకు పక్కాగా ఉంచుతారు. జనవరి నుంచి మార్చి వరకు కొందరు రైతులు పత్తి చెట్లు తీసేసి ఇతర పంటలు వేస్తుంటారు. మార్చి వరకు పంటను ఉంచి నీళ్లు, ఎరువులు అందిస్తే పూత, కాతతో మళ్లీ 34 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఖరీఫ్ లో అలాంటి పరిస్థితి లేదు. నవంబరు మొదటి పక్షంలోనే రైతులు పత్తి చేను తీసేసి, నేలను చదును చేస్తున్నారు. పెద్దగా దిగుబడి రాని పంటను నాలుగైదు నెలలు ఉంచడం ఎందుకన్న ఆలోచనతో పత్తి తీసేస్తున్నారు. వర్షాల తాకిడికి చెట్లు పెరగకపోవడం, ఆకులు ముడతపడడం, కాయలు నల్లబడడంతో పత్తి మొక్కలను తీసేయడమే మేలన్న నిర్ణయానికి వచ్చారు. ఒకటి, రెండు సార్లు పత్తి తీసే స్థాయిల్లోనే చేనును దున్నేస్తున్నారు. అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కొందరు రైతులు ఇతర పంటలు కూడా వేస్తున్నారు. సాధారణంగా మొక్కజొన్న సాగుకు ప్రత్యేక సీజనేమీ ఉండదు. నీటి వసతి ఉంటే ఎప్పుడైనా వేసుకోవచ్చు. దీంతో రైతులు పత్తి చేనును తొలగించి, మొక్కజొన్నను సాగు చేస్తున్నారు.

### ఏడు ఎకరాల్లో పత్తి తీసి మొక్కజొన్న వేశా : కల్తి నరసింహరావు, వీరభద్రాపురం.



ఈ ఖరీఫ్ లో ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశా. అధిక వర్షాలకు పంట ఎర్రబారిపోయింది. పత్తి కాయలు నల్లగా మారాయి. ఎకరానికి 3 నుండి 4 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. కాలపరిమితి ముగిసేవరకు పంట ఉంచినా లాభం లేదని అనిపించింది. అందుకే పత్తి మొక్కలను పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేశా. పత్తి సాగుతో తీవ్రంగా నష్టపోయా. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. పత్తిపంటను దున్నేసి మొక్కజొన్న వేయడం ద్వారా యాసంగిలో అయినా ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని ఆశిస్తున్నా.

### కూలీలకు కూడా సరిపోవట్లేదు : నీలాల అశోక్, వెంగన్న పాలెం



ఈ ఏడాది మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశా. రూ.90 వేలు పెట్టుబడి పెట్టాను. వర్షాలతో దిగుబడి తగ్గింది. రెక్కల కష్టం పోను పెట్టిన డబ్బులు వచ్చే పరిస్థితి లేదు. మూడు, నాలుగు సార్లు పత్తి ఏరితే కూలీల ఖర్చు ఎక్కువగా అవుతుంది. మార్కెట్ లో పత్తికి ధర తక్కువ ఇస్తున్నారు. అమ్మిన డబ్బులు ఏరిన కూలీలకు సరిపోవడం లేదు. అందుకే పత్తి పంటను పీకి ఆడ మగ మొక్కజొన్న వేస్తున్నాను.

## 29 కార్మిక చట్టాలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వం

-కార్మికులకు వెన్ను పోటు పొడిచిన బిజెపి పాలకులు

-ఈనెల 26న కార్మిక వర్గం నిరసన తెలపండి

-ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి నరాటి



ప్రజాపక్షం/ములకలపల్లి: బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి దేశానికి స్వతంత్రం వచ్చిన భారత ప్రభుత్వంలో కార్మిక సంఘాల పోరాటాలు ఫలితంగా 29 కార్మిక చట్టాలను 1930 నుండి 1950 వరకు కార్మికులకు సంక్షేమం కోసం చట్టాలను సాధించుకుంటే నేటి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక సంక్షేమ చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నూతన నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం దురదృష్టకరమని ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మోడీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాల వలన దేశంలో కార్మికులకు ఉద్యోగులకు ఎంతో భద్రత ఉన్నదని పరిశ్రమలు అధిపతులకు మానవ శ్రమను దోపిడి చేయకుండా వారు చేస్తున్న పనికి సరైన వేతనము హక్కులను కల్పించడమే ధ్యేయంగా ఉన్న చట్టాలతో ఈనాటి వరకు కార్మిక వర్గం సంతోషంగా ఉంటే ఈనాటి బిజెపి మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చే విధంగా కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను మోసం చేశారని ఆవేశం చేశారన్నారు. వేతనాలు కూడా 2019, పారిశ్రామిక సంబంధాలు కోడ్ 2020, సామాజిక భద్రత కూడా 2020, వృత్తి భద్రత ఆరోగ్యం పని పరిస్థితులు కోడు 2020, అనే నాలుగు కోడలు పేరిట సరికొత్త నిబంధనలు తీసుకువచ్చిందని దీనివల్ల కార్మిక వర్గం మొత్తం కూడా రానున్న రోజులలో నష్టాలు పాలు కావటం ఖాయమని తెలిపారు. బిహారి ఎన్నికల విజయంతో ఏ దుర్మార్గంమైన చట్టాలను చేసిన ఎవరు నోరు మెదపరని కండకావర్యంతో మోడీ దేశ కార్మికుర్గానికి వెన్నుపోటు పొడిచారని అన్నారు. తక్షణమే కోట్లాది మంది కార్మిక వర్గం 29 కార్మిక చట్టాల వలన జరిగే ప్రమాదాన్ని గ్రహించి మోడీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేందుకు ఈనెల 26వ తేదీన దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిరసన తెలియజేయాలని తెలిపారు.

## నాలుగు అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ప్రజాపక్షం/పాల్వంచ : నిభందనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టణ పోలీసులు పట్టుకొని శనివారం స్టేషన్‌కు తరలించారు. మున్సిపాలిధి పరిధి కుంటినాగులగూడెం సమీపంలోని మొర్రేదువాగు నుండి అనుమతులు లేకుండా నాలుగు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను పాల్వంచకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ కే. సుమన్ కేసు నమోదు చేశారు. కాగా కిన్నెరసాని పరీవాహక ప్రాంత గ్రామాలైన రంగాపురం, నాగారం, పినపాక పట్టి నగర్ తదితర ప్రాంతాల నుండి రాత్రి సమయంలో పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుకను పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. వాటిపై నిఘాపెట్టాలని పలువురు కోరుచున్నారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో ఉషా శీలా స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, కృషి సంస్థ సహకారంతో కృషి సంస్థ డైరెక్టర్ పొతగాని కృష్ణారావు ఆధ్వర్యంలో ఎం కరుణ సహకారంతో బూర్గంపాడు గ్రామంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న నిరుపేద మహిళలకు తొమ్మిది రోజుల కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కార్యక్రమం ఈనెల 22 నుండి 30వ తేదీ వరకు జరుగుతుందని ఏపిఎం హేమంతిని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏపిఎం హేమంతిని ముఖ్యఅతిథిగా పాల్గొనగా మండల అధ్యక్షురాలు రాజశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణ ద్వారా నిరుపేద మహిళలు వారి జీవనోపాధి పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి అనంతరం ఉచితంగా కుట్టు మిషన్, సర్టిఫికెట్ ఉషా కంపెనీ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐకెపి సీసీలు సునీత, రాంబాబు, వీవోఏలు పాల్గొన్నారు.

## మోడల్ డెమో ఫామ్‌ను సందర్శించి రైతులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసినటువంటి మోడల్ డెమో ఫామ్‌ను కరకగూడెం, దుమ్ముగూడెం, చర్ల మండలాలకి సంబంధించినటువంటి రైతులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా తక్కువ భూమిలో కూరగాయల పంట, బంతి పూల మొక్కలు, కౌజు పిట్టలు, మేకలు, చేపల పెంపకానికి ఏర్పాటు చేసినటువంటి షెడ్డు నిర్మాణాన్ని ఉపాధి హామీ ఏపీఓ విజయలక్ష్మి రైతులకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ భూమిలో ఎక్కువ పంటలను వేయడం, అదే విధంగా కౌజు పిట్టలు, మేకలు, చేపల పెంపకం ద్వారా రైతులు లాభాలను పొందవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ వెంకట్, టీఏ స్వాతి, సీసీ, వీవోఏ భారతి, పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి ఆర్థిక చేయూత



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రం భారతనగర్ కాలనీకి చెందిన సోమంతల లక్ష్మి అనారోగ్యంతో గత వారం క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ సోమందల లక్ష్మి దశదిన కార్యక్రమ నిమిత్తము వారి కుటుంబానికి లక్ష్మి కుమారుడు సోమందల మోహన్‌కి శనివారం 5000రూపాయలు బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమందుల లక్ష్మి మృతి చెందడంతో ఆ కుటుంబం నిరాశ్రయులయ్యారని, బాధితులకు అండగా నేనున్నానంటూ వారి కుటుంబానికి ఆ దేవుడు ఓదార్పు దయ చేయాలన్నారు. శనివారం వారి వద్దకు వెళ్లి ఆపద సమయంలో మానవత్వం మంచి మనసున్న మనిషిగా మాకు చేయూతను అందించినందుకు ఆ కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డొంకిన రవీందర్ గౌడ్, ఎండి ఖలీలుల్లా ఖాన్, తెలంగాణ ఉద్యమ నాయకులు సోమందల నాగరాజు, భరత్ నగర్ కాలనీ కుల పెద్దమనిషి మైపా పైరయ్య, తోగర పోతయ్య, మైపా అనిల్ కుమార్, సాయి మేస్త్రీ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి




ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్రంలోని మోడి ప్రభుత్వం లేబర్‌కోడ్‌ల అమలు కోసం చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రదు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శనివారం బస్టాండ్ సెంటర్‌లో దగ్ధం చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను, హక్కులను రద్దుచేస్తూ తెచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లపై తీవ్ర నిరసనలు వెల్లువెతుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. బీహార్ ఎన్నికలలో గెలిచిన తరువాత నూతన చట్టాన్ని అమలు చేయటం సిగ్గు చేటని విమర్శించారు. నూతన కార్మిక చట్టాలకు వలస పాలకుల వసనలు ఉన్నాయని వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెస్తున్నామని కేంద్రం ప్రభుత్వం చెపుతున్న మాటలు పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. నూతన చట్టాలు కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా ఉన్నాయని దీనితో కార్మికవర్గం స్వేచ్చా, ఉద్యోగ భద్రత, వేతన భద్రత, హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కావునా కార్మికలోకం ఐక్యంగా ముందుకు వచ్చి నూతన చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ పాల్వంచ ఏరియా కమిటి అద్యక్షులు వేల్పుల రమేష్, కుంజా భాస్కర్, సాయిబాబు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల డిమాండ్ సహేతుకం, సమర్ధనీయం



**-ముఖ్యమంత్రి దృష్టికి సమస్య : కూనంనేని**
**-కూనంనేనికి పెన్షనర్ల వినతి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఏళ్ల పాటు వివిధ హోదాలలో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిలను చెల్లించకపోవడం శోచనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. పెన్షనర్ల డిమాండ్ సహేతుకమైందని, సమర్ధనీయమైందని సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం కూనంనేనికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ 20 మాసాలుగా రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక మంది తన దృష్టికి తీసుకు వచ్చారని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా కోట్లాది రూపాయలను వివిధ రంగాలకు ఖర్చు చేస్తున్నారని ఒకేసారి కాకపోయినా విడతల వారీగా రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్‌ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ కొరకు కొన్ని నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా అవి పెన్షనర్లకు అందకపోవడంలో లోపం ఎక్కడ ఉందో తెలుసుకోవాలని ఆయన అధికార యంత్రాంగాన్ని కోరారు. అనేక మంది భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేతనం నుండి పొదుపు చేసుకున్నారని వాటిని కూడా చెల్లించకపోవడంతో వారి ప్రణాళికలన్నీ తారుమారై ఆర్థికంగా, ఆరోగ్యంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెన్షనర్లు సాగించే ఆందోళనకు కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు ప్రకటించడమే కాకుండా పెన్షనర్ల తరుపున సాగే ఆందోళనల్లో తాము పాలుపంచుకుంటామని ఆయన తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, సంఘం బాధ్యులు గుర్రాల శ్రీనివాసరావు, పెదమాళ్ల సత్యనారాయణ, మల్లికార్జునరావు, సుధాకర్, అన్నమ్మ, ఉమాదేవి, నాగలక్ష్మి, గడల భాస్కర్‌రావు, రహీముద్దీన్, లింగయ్య, మురళికృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవిశ్రీ మహిళా సమాఖ్యలో ఏం జరుగుతుంది?




**-ఐదు పంచాయతీల్లోనేనా నిధులు డబ్బులు మాయం?**
**-రూ.50లక్షలు వాడుకుంది ఎవరెవరు?**
**-సిసిలకు డబ్బుల దుర్వినియోగం తెలియదా?**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పరిధిలోని దేవిశ్రీ మండల మహిళా సమాఖ్యలో ఏం జరుగుతుంది? సిసిల పర్యవేక్షణలో పలు గ్రూపు సభ్యుల పాలిట శామమా? ఎందుకు నిధులు దుర్వినియోగం అవుతున్నాయి? కష్టపడి సంపాదించుకున్న డబ్బులు ప్రతి నెల పొదుపుకు చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడి కడుతున్నారు. అలాంటి ప్రజలు కష్ట జీవితాన్ని సొమ్ము చేసుకుంటుంది ఎవరు? అసలు దేవిశ్రీ మహిళా సమాఖ్యలో నిధులు గోల్‌మాల్ వెనక ఎవరెవరున్నారు. వైరా మండలం పాలడుగు, గరికపాడు, ఖానాపురం, సిరిపురం, గొల్లపూడి గ్రామాల్లో సుమారు రూ.50లక్షల వరకు దుర్వినియోగం అయినట్టు సమాచారం. డ్వాక్రా గ్రూపుల నుంచి తీసుకున్న డబ్బులు ఏ విధంగా దుర్వినియోగమయ్యాయి. ఎవరు దుర్వినియోగానికి పాల్పడ్డారు. దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిసి కూడా ఎందుకు నేటి వరకు చర్యలు తీసుకోవడం లేదు. అసలు దేవిశ్రీ మండల మహిళా సమాఖ్యలోని సిసిలు ఏం చేస్తున్నారు? సిసిల కనుసైగల్లోనే నిధులు గ ఓల్‌మాల్ అవుతున్నాయా? లేదా సిసిల పర్యవేక్షణ లోపంతో గోల్‌మాల్ అవుతున్నాయా? అనేది చర్చనీయాంశంగా మారింది. వైరా మండవలంలో 22 పంచాయతీలు ఉన్నాయి. 22 పంచాయతీలో దేవిశ్రీ మండల మహిళా సమాఖ్య పరిధిలో పొదుపు డబ్బులు దాచుకునే గ్రూపులు ఒక్కొక్క గ్రామంలో మూడు నుంచి నాలుగు గ్రూపలు కూడా ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఇలా ప్రతి గ్రూపులోను డబ్బులు పొదుపు చేసుకుంటూ ఏదో ఒక అవసరానికి ఉపయోగపడతాయని లోన్‌లు రూపంలో డబ్బులు తీసుకొని ప్రతినెలా కడుతూ వస్తున్న డ్వాక్రా గ్రూపు సభ్యులకు చివరకు భంగపాటే జరుగుతుంది తప్ప వారికి ఎలాంటి న్యాయం జరగడం లేదు అని చెప్పవచ్చును. అసలు డ్వాక్రా గ్రూపుల నుంచి వసూలు చేసిన డబ్బులు ఎందుకు జమ చేయడంలో ఆలస్యం వహిస్తున్నారు. ప్రతి క్లస్టర్‌కి ఒక సిసి ఉంటారు. ఆ సిసి ఈ గ్రూపులపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నారా మరి డబ్బులు దుర్వినియోగం అయినవి అని తెలిసి గత కొన్ని నెలలు గడుస్తున్నా కూడా ఎందుకు వాటిని రికవరీ చేయలేదు. డ్వాక్రా గ్రూప్ సభ్యులు అడుగుతుంటే కనీసం వారికి సమాధానం కూడా చెప్పిన సందర్భాలు లేవనే మాటలు వినిపిస్తున్నాయి. వైరాలోని దేవిశ్రీ మండల మహిళా సమాఖ్యలో జరిగిన నిధుల మళ్లింపుపై మౌనం వీడేది ఎన్నాడు. 22 పంచాయతీల్లో కూడా ఇంకా పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినవా అంటే జరిగాయని వినిపిస్తుంది. వాస్తవాలు బయటకి రావాలి అంటే అది ఎంతవరకు దుర్వినియోగం అయింది. ఎన్ని కోట్లు దుర్వినియోగం అయింది అనేది కూడా తెలియాలి అంటే ముందు సిసిల వద్ద నుంచి నివేదిక తీసుకోవాలి. ఐకెపి ఏపిఎంలు ఏం చేస్తున్నారు. అసలు వారు పరివేక్షణ ఉందా, ఏపిఎంలు పేరుకే నా లేదా కుర్చీకే పరిమితమా, మీ పర్యవేక్షణ ఉంటే నిధులు ఎందుకు దుర్వినియోగం అవుతున్నాయి. ఎందుకు మింగుతున్నారు. ఇప్పటికైనా మీరందరూ మౌనం వీడి దారి మళ్లిన నిధులపై చర్యలు చేపట్టి రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్‌బిఐటిలో ఘనంగా ప్రెషర్స్ డే




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ప్రాంగణంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సిఎస్ఈ, ఈసిఈ, ఈఈఈ విద్యార్థులు నిర్వహించిన వేడుకలు సందడిగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఎదుగుదలను, పతనాన్ని నిర్ణయించేది విద్యార్థి దశే అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా ఉంటూ తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందన్నారు. అటానమస్ న్యాక్ ఏ ప్లస్ హోదాతో తమ కళాశాల విద్యార్థులకు అవసరమైన ఆధునీక ల్యాబ్స్, లైబ్రరీ, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధనను అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్లేస్‌మంట్ వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ కళాశాలపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రణాళికాబద్ధంగా మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు అవసరమైన శిక్షణను అందిస్తున్నామని తెలిపారు.ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్, ఐసిటి అకాడమీ , హానివెల్, మాంగోడిబి, ఐబిఎం వంటి ప్రపంచ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని విద్యార్థులకు శిక్షణా అందిస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాల కేవలం డిగ్రీ కోసం కాకుండా పూర్తి స్థాయిలో ఇంజనీర్లను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు ధీటుగా ప్లేస్‌మెంట్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, హెచ్‌వోడిలు అమిత్ బిందాజ్, చరణ్ సింగ్, సుప్రియ, స్ఫూర్తి, పద్మావతి, మురళీమోహన్, ప్రభాకర్, టిపివో ఎన్. సవిత తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలతోనే జ్ఞానాభివృద్ధి



**ప్రజాపక్షం/ మధిర :** పోటీ పరీక్షల ద్వారానే విద్యార్థుల్లో జ్ఞానాభివృద్ధి జరుగుతుందని ఎంఇఓ వై.ప్రభాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మాటూరు ఉన్నత పాఠశాల ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే చిన్నారులకు పరీక్షా సామాగ్రిని ఎంఇఓ చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కొలగాని ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా ప్రయాణంలో తాము అందుకున్న విజయాన్ని భావి విద్యార్థుల విజయానికి సోపానంగా మార్చుతూ మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యంత ఆదర్శప్రాయమైన కార్యక్రమాన్ని నిర్వహించడానికి చక్కటి బాటను వేశారని కొనియాడారు. విద్యా సంవత్సరంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సంవత్సరం కూడా ఎంఎస్ఎస్ పరీక్షలు హాజరై పిల్లలకు వారికి అసరమయ్యే ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర వస్తువులను వితరణ అందచేసిన దాతలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, లావుడ్య రవికుమార్, పగిడిపల్లి ఇస్సాక్, రామరత్నం, ఎంఆర్‌వివి ప్రసాద్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# నిషేధిత గంజాయి పట్టివేత




**ప్రజాపక్షం/ మధిర :** నిషేదిక గంజాయిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మధిర రూరల్ సిఐ మధు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్న సంఘటన జరిగింది. శనివారం మధిర రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ కలకోట గ్రామానికి చెందిన యంగల కార్తీక్, తోటపల్లి రాహుల్, తోటపల్లి చరణ్‌శేఖర్ అనే యువకులు టిఎస్ 07హెచ్ 0914 నెంబర్ గల స్కూటీపై కలకోట వైపు నుండి సిరిపురం వైపుకు వెళ్తుండగా మల్లారం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో 1.085కేజిల నిషేధిత గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశా, చింతూరు ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు , గంజాయి సేవించి మిగతా భాగం అమ్మి డబ్బు సంపాదిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి తరలిస్తున్న స్కూటీని, సెల్‌ఫోన్లు, నిందిదులను అదుపులోకి తీసుకుని ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు సిఐ తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్

**- మోడిఫైడ్ సైలెన్సర్‌కు వెయ్యి రూపాయల జరిమానా**




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ద్విచక్ర వాహనాలపై వేగంగా నడుపుతూ సెలెన్సర్ల తో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ, ఫిట్లు ప్రదర్శి స్తున్న ఆకతాయిలకు చెక్ పెట్టెందుకు ట్రాఫి క్ పోలీసులు శనివారం నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు నేతృత్వంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రాఫిక్ సిఐ సత్యనా రాయణ, ఎస్సైలు సిబ్బందితో నగరంలోని ప్రధాన కూడళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రత్యేకంగా ద్విచక్రవాహనాలపై దృష్టిసారించి వారిని ఎక్కడికక్కడి నిలిపి వాహనాలకు సంభందించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. కంపెనీ సైలెన్సర్లకు బదులు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి తిరుగుతుండటంతో వాటిని తొలగించి వారికి జరిమానాలు విధించారు. కొందరు అకతాయిలు సైలెన్సర్లు మార్చి పెద్దపెద్ద శబ్ధలతో రోడ్లపై ఫీట్లు చేస్తూ స్థానికులను, పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో వారిపై చర్యలు తీసుకునేందుకు నిత్యం తనిఖీలు చేపట్టనున్నట్లు ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు భద్రత పాటించని వారిపై జరిమానాలతో పాటు వాహనాలను సిజ్ చేస్తామన్నారు. అతిగా ప్రవర్తిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో 20 వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లు తొలగించి ఒక్కోక్కరికి రూ.1000/ జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ సుమారు వెయ్యి మోడిఫైడ్ సైలెన్సర్‌లను తొలగించినట్లు ఆయన తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

# సిపిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏసిపి వసుంధర



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** కల్లూరు నూతన ఏసిపిగా సత్తుపల్లిలో బాధ్యతలు చేపట్టిన వసుంధర యాదవ్ అనంతరం ఖమ్మం సిపి కార్యాలయంలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్‌ను మర్యాదపుర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి ఆమెకు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అంకితబావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

# మహిళల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



**-ఎంఎల్ఏ జారే ఆదినారాయణ**

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభివృద్ధికి పని చేస్తుందని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని తుంగారం గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ, అదే విధంగా ఇందిరమ్మ గృహ ప్రవేశం, సీసీ రోడ్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం వడ్డీ లేని రుణాలు ఇస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, డిఆర్‌డిఏ పీడీ విద్యాచందన, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, తుమ్మలపల్లి సురేష్, ఫజల్ బక్ష, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జిటి ఉపాధ్యాయుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేయుచున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులకు సబ్జెక్టుకు సంబంధించిన బోధన సామర్థ్యాల అభివృద్ధి అలాగే ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభ్యాసన ప్రక్రియలు పరిశీలించి పర్యవేక్షణ చేయడానికి సహకరించే విధంగా అందిస్తున్న ఈ శిక్షణను ఎస్‌జిటి ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం ఇల్లందు వైటిసి కేంద్రంలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులకు ఉపాధ్యా సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సామర్థ్య నిర్మాణ శిక్షణ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఎస్‌జిటి ఉపాధ్యాయులకు సులభంగా పాఠ్యా పుస్తకాలు బోధించడానికి ఉపయోగపడుతుందని, దీనిని ఎస్‌జిటి ఉపాధ్యాయులందరూ చక్కగా ఉపయోగించుకొని పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధించడానికి దోహదపడుతుందన్నారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో నిర్వహిస్తున్న శిక్షణలో మొత్తం 292 మంది ఎస్‌జిటి ఉపాధ్యాయులు, 14 మంది డిఆర్‌పీలు పాల్గొన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని విజయలక్ష్మి, ఏటీడీవోలు రాధమ్మ, రమేష్, ఏసీఎంఓ రాములు, హెచ్‌డబ్ల్యూఓలు, ఎస్‌సిఆర్‌పిలు, ఎస్‌జిటి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ బీట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**జేఏసీ అధ్యక్షులు పోలేబోయిన వెంకటనారాయణ**



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఏడుళ్ల బయ్యారం రేంజ్ పరిధిలోని లంబాడి ఫారెస్ట్ అధికారులు గిరిజన ఆదివాసులపై కక్ష్య పూరితంగా ప్రవర్తిస్తున్న తీరుపై చర్యలు తీసుకోవాలని కరకగూడెం మండల ఆదివాసీ జేఏసీ అధ్యక్షులు పోలేబోయిన వెంకటనారాయణ శుక్రవారం మణుగూరులో భద్రాద్రి జిల్లా డి ఎఫ్ ఓ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో గిరిజనేతరులు, లంబాడీలు కొత్తగా చెట్లు నరికి చేసుకుంటున్న భూమి జోలికి కానీ, ఫారెస్ట్ ట్రెంచ్ తీసిన భూమిని సాగుచేస్తున్న వారి జోలికి వెళ్లడం లేదు. ఆదివాసులు కోతులు పంటను నాశనం చేస్తున్నాయని ఒక చెట్టు నరికిన దాన్ని ఫోటో తీసుకొని రేంజ్ అధికారి సమక్షం లో కాకుండా ఫారెస్ట్ లంబాడా అధికారులు చెప్పపెట్టకుండా రేంజ్ ఆఫీసుకి తీసుకుపోవడం సరైన పద్ధతి కాదన్నారు. అటవీ శాఖ బీట్ అధికారులు గిరిజనేతరులు, లంబాడీలు చేసుకుంటున్న భూములలో ఎటువంటి ఎఫ్‌సిసి పాయింట్స్ కనబడవు కానీ, కేవలం ఆదివాసులు వ్యవసాయం చేసుకుంటున్న ప్రాంతంలోనే ఎఫ్ సి సి పాయింట్స్ ఎలా వస్తాయని మండిపడ్డారు. వాహనాలు వెళ్ళే మార్గం ఉంటేనే అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలిస్తున్నారు కానీ మార్గం లేని భూముల జోలికి వెళ్లడం లేదన్నారు. ఫారెస్ట్ అధికారులు ఎవరైనా కానీ సమన్వయంగా విధులు నిర్వర్తించాలి కానీ కులవివక్షను దృష్టిలో పెట్టుకొని ఒక్క ఆదివాసీ సమాజం పైనే కక్ష పూరితంగా విధులు కొనసాగిస్తే ఆదివాసీ జేఏసీ చూస్తూ ఊరుకోదు ఖచ్చితంగా ప్రశ్నిస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# మార్కెట్ సమస్యను మంత్రులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..



**పత్తి మార్కెట్ యార్డును పరిశీలించిన డా.శంకర్ నాయక్**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డా.శంకర్ నాయక్ శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలోని పత్తి మార్కెట్ యాడ్ ను పరిశీలించి శాశ్వత మార్కెట్ గా ప్రభుత్వం కేటాయించిన నిధులను టెండర్ ప్రక్రియ త్వరిత గతిన చేపట్టి, మార్కెట్ కు కేటాయించిన భూమిలో చదును చేసి మార్కెట్ నిర్మాణం చేపట్టాలని అలాగే మార్కెట్ కు వచ్చే రైతులకు, పని చేస్తున్న హామీలలకు తగిన వసతి సౌకర్యాలు కలిపించాలని ఏన్కూరు మార్కెట్ సెక్రటరీ బజారు, జూలూరు పాడు తహశీల్దార్ కు ఫోన్లో మాట్లాడారు. మార్కెట్ గురించి స్థానిక ఎంఎల్ఏ రాందాస్ నాయక్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పివో దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ సమస్యను పరిష్కారం చూపే విధంగా కోరతామని మార్కెట్ లో పత్తి కొనుగోళ్ళ లో జరిగేటప్పుడు ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని వేబ్రిడ్జి లను పరిశీలించారు. అనంతరం మాచిన పేటలో కేశవ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన జేఏసీ సమావేశంలో అంగన్వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మల్టి పర్పస్ వర్కర్లు, ఆటో యూనియన్ సంఘాలు పాల్గొని జేఏసీకి వారి సంపూర్ణ మద్దత్తు తెలిపి అనంతరం చైర్మన్ శంకర్ నాయక్ ను సన్మానించారు. అలాగే జేఏసీ కో కన్వీనర్లుగా మూడ్ రమేష్, భూక్యా లలిత, భూక్యా నాగు లను నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ వీరు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాన్షిరాం, కేశవ్ నాయక్, కో కన్వీనర్లు మోహన్ నాయక్, చిట్టి బాబు నాయక్, మోహన్ నాయక్, కోటేష్ నాయక్, వీరన్న, వెంకటేష్, భద్రం,, జగదీశ్, బాల్య తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాల వితరణ



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** సింగరేణి కాలరీస్ మాజీ డైరెక్టర్ డి సత్యనారాయణ రావు రూ.5 వేల విలువగల మెడికల్, ఇంజనీరింగ్‌కు సంబంధించిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆయన శనివారం గ్రంథాలయానికి చేరుకుని చైర్మన్ వీరబాబుకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చదువుకునే వారి సౌకర్యార్థం ఔధార్యంతో పుస్తకాలు అందించి తమవంతు సేవచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు గుమ్మడి మణి మృధుల పాల్గొన్నారు.

## 300 వార్డులకు రిజర్వేషన్ల ఖరారు

**లాటరీ పద్ధతిలో అఖిలపక్షం నాయకుల సమక్షంలో ఎంపిక**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన 300 వార్డుల ను రిజర్వేషన్లను శనివారం అధికారులు ఖరారు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో అఖిలపక్షం నాయకుల సమక్షంలో వార్డుల రిజర్వేషన్ లను లాటరీ పద్ధతిలో ఖరారు చేశారు. ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ ల పర్యవేక్షణలో మొత్తం 300 వార్డులకు గాను 36 ఎస్టీ, 64 ఎస్సీ, 54 బీసీ, 148 జనరల్ అభ్యర్థులకు ఖరారు చేశారు. వీటిలో 126 వార్డులను మహిళలకు రిజర్వ్ చేశారు. మండలం లోని 12 గ్రామ పంచాయతీలలో 7 వార్డులలో టై ద్వారా ఎంపిక చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ లకు గతంలో కేటాయించిన స్థానాలు యధాతథాంగా ఉన్నాయి. బీసీల కు కేటాయించిన చోట్ల మాత్రమే ఆన్ రిజర్వ్ చేశారు. కోనాయిగూడెం గ్రామంలో బీసీలకు ఒక్క వార్డు కూడ కేటాయించలేదు. రిజర్వేషన్ లను అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏకగ్రీవంగా అమోదించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వున్నం బ్రహ్మయ్య, పసుమర్తి శ్రీనివాస్, వంగవీటి నాగేశ్వరరావు, మామిడి వెంకన్న, కడియాల నరేష్, పాగర్తి సుధాకర్, కోటి సైదారెడ్డి, కె.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపే చీరల పంపిణీ



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఈ నెల 24వ, తేదీన ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ఇందిరమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు చేశామని ఎంపిడిఓ కుడుముల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు విఓఏ, సిసిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొపాట్లాకు తావులేకుండా పంపిణి కొనసాగటానికి సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ఫ్) ఇందిరాక్రాంతి పథం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి, మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతిలో భాగంగా 18 సంవత్సరాలు వయసుపై బడిన మహిళలకు ఏకరూప చీరలు పంపిణి చేయనున్నట్లు చెప్పారు. కావునా మహిళా సమాఖ్య సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరాక్రాంతి పథం, సెర్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు.

**ఎస్సీ -7, ఎస్టీ -4, బిసి-4,జనరల్ -17**

**32 పంచాయతీలలో 15 స్థానాలకు మహిళలకు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని గ్రామ పంచాయతీ సర్పంచ్ లను ఖమ్మం ఆర్డీవో శనివారం ప్రకటించారు. మొత్తం 32 గ్రామ పంచాయతీలకు గాను, ఎస్టీ లకు4, ఎస్సీ లకు 7, బీసీ లకు4, జనరల్ 17 స్థానాలను కేటాయించారు. వీటిలో 15 పంచాయతీలకు మహిళలకు రిజర్వేషన్ ను కేటాయించారు.

**రిజర్వేషన్ వారీగా వివరాలు ఇలా ఉన్నాయి...**

కొత్తకొత్తూరు ఎస్టీ మహిళ, నాచేపల్లి ఎస్టీ మహిళ, మంద్రాజుపల్లి ఎస్టీ, కట్టుకాచారాం ఎస్టీ , పైనంపల్లి, ఎస్సీ, ఆచార్లగూడెం ఎస్సీ మహిళా, చెన్నరం ఎస్సీ మహిళా, రామచంద్రపురం ఎస్సీ, అనాసాగరం ఎస్సీ, బుద్దారం ఎస్సీ, ముజ్జుగుడెం ఎస్సీ మహిళా, నేలకొండపల్లి బిసి మహిళా, చెరువు మాధరం బీసీ, బోదులబండ బీసీ, కోరట్లగుడెం బిసి మహిళా, అమ్మగూడెం జనరల్ మహిళా, రావిగూడెం జనరల్ , రాజారాం పేటా జనరల్ , ఆరెగూడెం జనరల్ మహిళా , భైరవునిపల్లి జనరల్ , రాజేశ్వరపురం జనరల్ , అప్పలనరసింహపురం జనరల్ మహిళా , సూర్దేపల్లి జనరల్ మహిళా , కోనాయిగుడెం జనరల్ , గువ్వలగుడెం జనరల్ మహిళా, కొంగర జనరల్ మహిళా, మోటపురం జనరల్, తిరుమలాపురం తాండా జనరల్ , మంగాపురం తండా జనరల్ మహిళా, శంకరగిరి తండా జనరల్ మహిళా, సదాశివపురం జనరల్, అజయ్ తండా జనరల్

# గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం



- ఈనెల 26న నోటిఫికేషన్ విడుదల
- డిసెంబర్ 11,14,17 తేదీలో ఎన్నికలు
- పాతప్రక్రియే కొనసాగింపు
- ఏజెన్సీ కావడంతో ప్రభావం అంతంత మాత్రమే
- పదేళ్ల తర్వాత భద్రాచలం, తాళ్లగొమ్మూరు జిపిల్లో ఎన్నికలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పంచాయితీ పోరుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందు కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 26వ తేదిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. పాతపద్ధతి ప్రకారం బిసి రిజర్వేషన్ 42 శాతంతోనే ఎన్నికలు వెళునున్నారు. ఈ ఎన్నికలు డిసెంబర్ 11,14,17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్నాయి. సెప్టెంబర్ లోనే ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ ఉన్నప్పటికీ బిసి రిజిర్వేషన్ ప్రక్రియలో కొర్రీలు ఏర్పడటంతో ఆలస్యమైంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని హై కోర్టు ప్రశ్నించడంతో రాష్ట్ర ప్రభుత్వం చేసేది లేక పాత పద్ధతిలోనే బిసి రిజర్వేషన్ 42 శాతంతో సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమైంది. కాగా ఈనెల 26వ తేదిన రాష్ట్ర ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయనుండగా ఈ ఎన్నికలు డిసెంబర్ 11,14,17 తేదీల్లో మూడు విడతసుగా జరపేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తాజా ఓటర్ జాబితా ప్రక్రియలో భాగంగా ఈనెల 23వరకు సవరణలు, జాబితాలో సవరణలు, పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులు ప్రకటించనుండగా సోమవారం పాతపద్ధతిలోనే గ్రామాల వారీగా రిజర్వేషన్ రోస్టర్‌ను జిల్లాలో సోమవారం విడుదల చేయనున్నారు.

**ప్రక్రియ పాతదే...**

బిసి రిజర్వేషన్ వ్యవాహారంతో ఆగిపోయిన ఎన్నికలు పాతపద్ధతిలోనే నిర్వహించనున్నారు. బిసి రిజర్వేషన్ 42 శాతం ప్రకారం ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడంతో బిసి రిజర్వేషన్ అ పద్దతిలో అమలు చేసినా పెద్ద ప్రభావం ఏమీ ఉండదని అధికారులు చెబుతున్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఎలాంటి పార్టీ గుర్తులు లేకుండా స్వతంత్ర గుర్తులతో భరిలో నివాల్సి ఉంటుంది.

**471 జిపిలు, 4168 వార్డులు...**

జిల్లాలోని 471 గ్రామపంచాయితీలు ఉండగా 4168 వార్డులున్నాయి. వీటిలో మొదటి విడతలో 159 గ్రామపంచాయితీలు, 1436 వార్డులకు, రెండో విడతలో 198 గ్రామపంచాయితీలు1392 వార్డులకు, మూడో విడతలో 156 పంచాయితీల్లో 1340 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల్లో ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధం చేసి కొందరి వద్ద నుండి నామినేషన్లు సైతం స్వీకరించారు. అప్పుడు సిద్ధం చేసిన పోలింగ్ సామాగ్రిని ఇప్పుడు వాడనున్నారు.

**మొత్తం ఓటర్లు 6,69,048 మంది...**

జిల్లాలో గ్రామీణ ఓటర్లు మొత్తం 6 లక్షల 69వేల 48 మంది ఉండగా, ఇందులో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. పరుషుల కంటే 18934 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

**భద్రాచలం, తాళ్లగొమ్మూరు జిపిలకు మోక్షం...**

భద్రాచలం, తాళ్లగొమ్మూరు గ్రామపంచాయితీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఈ రెండు గ్రామపంచాయితీలకు ఎన్నికలు నిర్వహించలేదు. వీటిని మున్సిపాలిటీలుగా చేసేందుకు ఎన్నికలు జరపలేదు. వీటిని గ్రామపంచాయితీలుగానే కొనసాగించాలని కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. భద్రాచలాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మూడు పంచాయితీలుగా విభజించాలని యోచించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏక పంచాయితీగానే కొనసాగిస్తోంది. దీంతో డిసెంబర్‌లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో భాగంగా పదేళ్ల అనంతరం భద్రాచలం, తాళ్లగొమ్మూరు గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయి.

# రిజర్వేషన్లపై అధికారుల కసరత్తు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** స్థానిక ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు కసరత్తు చేపట్టారు. రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై శనివారం అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆర్డివో పరిధిలో జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు కేటాయింపు చేయనుండగా వార్డు సభ్యులకు సంబంధించి మండల స్థాయిలో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి 308 వార్డులు ఉన్నాయి. వార్డుల్లో 50 శాతం జనరల్ కేటగిరికి కేటాయించగా మిగిలిన 50 శాతానికి సంబంధించి ఎస్సి, ఎస్టి, బిసిలకు సంబంధించి 2018 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మండల పరిధిలోని మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో కొర్లబోడు తండా, లచ్చిరాంతండా గ్రామ పంచాయతీలు పూర్తి ఎస్టి జనాభా కలిగి ఉన్నాయి. ఎస్టిలకు 116, ఎస్సిలకు 24, బిసిలకు 20 వార్డులు రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం. అదేవిధంగా జిల్లా యూనిట్‌గా సర్పంచ్ ఎన్నికలకు



రిజర్వేషన్లు కేటాయించడంతో రఘునాథపాలెం మండలంలో బిసిలకు ఒక సర్పంచ్ స్థానం కూడా కేటాయింపు లేనట్లు సమాచారం. 2018లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో రిజర్వేషన్లు అయిన వాటికి రోటేషన్ పద్దతిలో ఇప్పుడు కేటాయింపులు జరపనున్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆశావాహుల సందడి నెలకొంది. పలువురు సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి ఆసక్తి కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తే ఖర్చుకు వెనకాడకుండా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

**ప్రజాపక్షం/కల్లూరుః** నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. 50% రిజర్వేషన్ల మించకుండా లాటరీ పద్ధతి ద్వారా బీసీ అన్ రిజర్వాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు సబ్ కలెక్టర్ శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశాలు మాట్లాడుతూ రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలు తెలిపారు. పెనుబల్లి మండలంలో మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా 8 షెడ్యూల్ గ్రామపంచాయతీ లు ఉండగా వాటిలో నాలుగు స్త్రీలకు, నాలుగు ఎస్టీ జనరల్ కు కేటాయించారు..మిగిలిన 25 నాన్ షెడ్యూల్ పంచాయతీలలో ఎస్సి 5 ,బీసీ మూడు,ఆన్ రిజర్వుడు కు 13 సర్పంచులు కేటాయించారు. సత్తుపల్లి మండలంలో 21 పంచాయతీలలో మూడు షెడ్యూల్ కేటగిరీకి కేటాయించగా, మిగిలిన 18లో ఎస్టి, మూడు ఎస్సీ, నాలుగు బీసీ, రెండుకు అన్ రిజర్వుడుకు తొమ్మిది కేటాయించారు. కల్లూరు మండలంలో 23 గ్రామపంచాయతీలలో ఎస్టీ రెండు, ఎస్సి 7, బిసి రెండు, అన్రిజర్వుడుకు 12 మంది సర్పంచులు ఉంటారు. తల్లాడ మండలంలో 27 గ్రామపంచాయతీలలో ఎస్టీ రెండు, ఎస్సీ 7, బిసి 4, ఆన్ రిజర్వుడుకు 14 సర్పంచులు ఉండనున్నారు. అదేవిధంగా మొత్తం 26 పంచాయతీలలో ఒక పంచాయతీ షెడ్యూల్ క్యాటగిరి, మిగిలిన 25 లో ఎస్సీ 7, బీసీ నాలుగు, అన్ రిజర్వ్ కింద 13 పంచాయతీలు కేటాయించారు. ఏన్కూరు మండలంలో మొత్తం 25 షెడ్యూల్ ఏరియా గ్రామపంచాయతీలు ఉన్నవి. వీటిలో 13 గ్రామపంచాయతీలు ఎస్టీ మహిళలకు, 12 పంచాయతీలు ఎస్టీ జనరల్ కు కేటాయించారు. మొత్తం 25 గ్రామపంచాయతీలలో ఒక పంచాయతీ షెడ్యూల్ కేటగిరికి మిగిలిన 26 పంచాయతీలలో ఎస్సీ 7, బీసీ 4, అండ్ రిజర్వుడుకు 13 పంచాయతీలను కేటాయించారు. ప్రకటించిన రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత గజిట్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సబ్ కలెక్టర్ విలేకరులకు తెలిపారు.



# తప్పుడు పత్రాలతో స్థలం ఆక్రమణకు యత్నం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తప్పుడు పత్రాలు సృష్టించి తమ స్థలాన్ని అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు రమాదేవి ఆరోపించారు. శనివారం బాధితురాలు రమాదేవి మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రమైన రఘునాథపాలెం ఎంపిడివో కార్యాలయం సమీపంలో సర్వే నెం.20లో గల మా ప్లాట్‌ను వేరే వ్యక్తులు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి అక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్లాటులో ఉన్న హద్దు రాళ్లను తొలగించి ఫెన్సింగ్ వేశారని ఆమె తెలిపారు. నాగరాజు అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆమె తెలిపారు. 2004లో తాము రూ. 30లక్షలకు దమ్మలపాటి రామలింగయ్య వద్ద కొనుగోలు చేశామని ఆమె తెలిపారు. ఇప్పుడు ఆ భూమి విలువ పెరగడంతో కొంత మంది అక్రమించేందుకు యత్నిస్తున్నారని దీనికి సంబంధించి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకోవడంతో ఇరువురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

# ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింత

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు దేవాదాయ శాఖకు శనివారం అప్పగించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకుని టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి 20 ఎకరాల భూమిని ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం అల్లిపురం ప్రాంతంలో గుర్తించారు. దానికి సంబంధించి 17.24 ఎకరాల ప్రభుత్వ భూమిని తొలుత దేవాదాయ శాఖకు అప్పగించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన అసైన్డ్ భూమిని కూడా స్వాధీనం చేసుకుని దేవాదాయ శాఖకు అప్పగించనున్నారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామికి భూ కేటాయింపుకు సంబంధించి పత్రాలను అందజేశారు. భూమి కేటాయింపు జరగడంతో త్వరలోనే ఆలయ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా రఘునాథపాలెంలో సర్వే నెం. 30లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇస్కాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు ఆలయ నిర్మాణాలు పూర్తయితే ఖమ్మంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.



# రేపే ఎన్‌టిఆర్ విగ్రహ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం దారుక బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం 24వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని దారుక బంజర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీ జనార్ధన్, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ చింతమనేని ప్రభాకర్, దెందులూరు శాసనసభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరుకానున్నట్లు అభిమాన సంఘం దారుక బంజర గ్రామస్తులు తెలిపారు.




# భట్టి పర్యటనకు కదిలిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/వైరాః** వైరాలో జరిగిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్యటనకు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో పట్టణ కాంగ్రెస్ నాయకుడు వీరంశెట్టి సీతారాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీతో భారీగా బయల్దేరి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి భట్టివిక్రమార్కకు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి గురుకుల పాఠశాల వరకు జరిగిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీరంశెట్టి సీతారాములు, బిడికె.వెంకన్న, దురిశెట్టి నర్సింహారావు, మోర్ శ్రీకాంత్, నడిపి, దురిశెట్టి నరస, దుగ్గిరాల జాకోబు, మరికంటి రాంగోపాల్ వర్మ, దుగ్గిరాల మహేష్, మొకర అశోక్, లక్ష్మ ణ్, మోర్ ప్రభాకర్, భువనాద్రి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

